పండగలా 'పట్టా'భిషేకం

- 30 ఏళ్లనాటి గాజువాక భూ సమస్యకు పరిష్కారం
- లబ్ధిదారుల ఆనందోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు,చిత్రంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కలెక్టర్ మల్లికార్జున తదితరులు



సమావేశానికి హాజరైన లబ్ధిదారులు

పెదగంట్యాడ: మూడు దశాబ్దాల నిరీక్షణ ఫలించింది. గాజువాక భూ సమస్యను పరిష్కరిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విడుదల చేసిన పట్టాలను శుక్రవారం పంపిణీ చేశారు. భారీగా తరలివచ్చిన జనం చేసిన జై జగన్ నినాదాలతో ప్రాంగణం హోరెత్తింది. పట్టాలు అందుకున్న ప్రతి ఒక్కరి కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. మండలంలోని గిరిజా కాలనీ శివాలయం గ్రౌండ్ శుక్రవారం పండగ వాతావరణం సంతరించుకుంది.

చారిత్రాత్మక నిర్ణయం

ప్రభుత్వ ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చారిత్రాత్మక నిర్ణయమని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లనాటి గాజువాక భూ సమస్య కు పరిష్కారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందన్నారు. సొంత భూమి కలిగిన ప్రతి ఒక్కరూ దానిపై హక్కును కలిగి ఉండాలని ఈ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్ పట్టాలు, ఉక్కు నిర్వాసితులకు, ఫార్మాసిటీ నిర్వాసితులందరికీ రూ.790 కోట్ల విలువ చేసే 7,026 పట్టాలను అందజేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కృషి వల్లనే ఇది సాధ్యపడిందన్నారు. నిరంతరం గాజువాక సమస్యల పరిష్కారం కోసం ఆయన ఎటువంటి వ్యయ ప్రయాసలకూ వెనుకాడబోవడం లేదన్నారు.

భూమిపై సంపూర్ణ హక్కు

వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పట్టాలు దేనికీ పనికి రాలేదన్నారు. ఇప్పుడు ఇచ్చిన పట్టాల వల్ల గాజువాక వాసులకు భూమిపై సంపూర్ణ హక్కు లభిస్తోందన్నారు. మూడు దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నెరవేర్చిందన్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాక హౌస్ కమిటీ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. వందల కోట్ల రూపాయల విలువైన భూములను ప్రజలకు శాశ్వత ప్రాతిపాదికన అందజేయడం సీఎం గొప్పదనమన్నారు.

7026 మందికి కన్వేయన్స్ డీడ్

కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ గాజువాక హౌసింగ్ సొసైటీ ద్వారా ప్రభుత్వ ఆక్రమిత భూముల్లో నివాసం ఉంటున్న 7026 మందికి కన్వేయన్స్ డీడ్స్ అందించామని, మరో 6,260 అందించడానికి కన్వేయన్స్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఉక్కు కర్మాగార నిర్వాసితులకు, ఫార్మా నిర్వాసితులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశామన్నారు.

కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, గాజువాక వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు), మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, తిప్పల వంశీరెడ్డి, బట్టు సూర్యకుమారి, ఇల్లపు వరలక్ష్మి, భూపతిరాజు సుజాత, రాజాన రామారావు, మహ్మద్ ఇమ్రాన్, గాజువాక, పెదగంట్యాడ తహసీల్దార్లు శ్రీవల్లి, రమాదేవి, నాయకులు కోమటి శ్రీనివాసరావు, పల్లా చినతల్లి, గుడివాడ లతీష్, దొడ్డి రమణ, బొడ్డ గోవింద్, రాజాన వెంకటరావు, వాసు, యువశ్రీ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్ల నిరీక్షణ ఫలించింది



30 ఏళ్లుగా భూములున్నా ఉపయోగించుకోలేకపోయాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన పట్టాలు భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంచాయి. పిల్లల ఎదుగుదల వల్ల వారికి ఏమీ చేయలేకపోతున్నామనే బెంగ నేటితో తీరిపోయింది. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు.

– లాలం వెంకట రమణ, భానోజీతోట

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



పట్టాల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూశాం. ఇప్పటి వరకూ మమ్మల్ని ఉపయోగించుకున్న ప్రభుత్వాలే తప్ప మాకు ఉపయోగపడ్డ ప్రభుత్వాలు లేవు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. సీఎం వైఎస్ జగన్‌కు మా కుటుంబం తరపున కృతజ్ఞతలు.

– షేక్ సుభాన్ బీబీ, శ్రీనగర్

చాలా ఆనందంగా ఉంది



ఇప్పటి వరకూ భూ పట్టాల సమస్య పరిష్కారం కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాం. ఇప్పటికి పరిష్కారం కావడం ఆనందంగా ఉంది. ఈ ప్రభుత్వం చేతులమీదుగా భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని కోరుకుంటున్నాం.

– ఆదారి లక్ష్మి, భానోజీతోట

భరోసా ఏర్పడింది



ఆస్తి ఉన్నా భూమి అమ్ముకోవడానికి, తాకట్టు పెట్టుకోవడానికి పనికిరాకుండా పోయింది. ప్రస్తుతం పట్టాల పంపిణీ కారణంగా పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు ఉపయోగపడతాయన్న భరోసా ఏర్పడింది. ప్రభుత్వానికి, సహకరించిన నేతలకు కృతజ్ఞతలు.

– ఎం.రామయ్యమ్మ, గాజువాక

దేశానికే ఆదర్శం మన వైద్య విధానం

- సీఎం జగన్ పాలనలో ప్రభుత్వాస్పత్రులకు స్వర్ణయుగం
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- ఘనంగా దువ్వాడ యూపీహెచ్‌సీ ప్రారంభోత్సవం



దువ్వాడ-2 యూపీహెచ్‌సీ



యూపీహెచ్‌సీని ప్రారంభిస్తున్న వైవీ సుబ్బారెడ్డి . చిత్రంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి



యూపీహెచ్‌సీలో సిద్ధం చేసిన పడకలు

కూర్మన్నపాలెం: ఆంధ్రప్రదేశ్‌లోని వైద్య విధానం దేశానికే ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వాస్పత్రుల రూపురేఖలు మారిపోయాయన్నారు. దువ్వాడ-2 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగన్ మోహన్ రెడ్డి కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వాస్పత్రుల్లో పూర్తిస్థాయి వసతులు కల్పించి, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారని చెప్పారు.

కార్పొరేట్‌కు దీటుగా యూపీహెచ్‌సీ

దువ్వాడ, పరిసర వాసులకు చేరువలో రూ.1.59 కోట్లతో దువ్వాడ-2 యూపీహెచ్‌సీ నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. కార్పొరేట్ ఆస్పత్రికి దీటుగా నిర్మించిన ఈ యూపీహెచ్‌సీలో ఇకపై ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు విధుల్లో ఉంటారని, మొత్తం 14 మంది వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య సేవలను అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని తెలిపారు. యూపీహెచ్‌సీలో ఇకపై 176 రకాలు మందులు, 65 రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయన్నారు. యూపీహెచ్‌సీలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఓపీ, టెలిమెడిసిన్, ఈహెచ్‌ఆర్, వైద్య పరీక్షలు, స్పెషాలిటీ వైద్య సేవలు 24 గంటలు ఉచితంగా అందుతాయన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టరు జగదీశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు, జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, కోమటి శ్రీనివాసరావు, వెలుగుల పరశురాముడు, క్లస్టర్ ఇన్‌చార్జి వాడపల్లి రామచంద్రరాజు, మండలాధ్యక్షులు బొడ్డ గోవింద్, చేగొండి శ్రీనివాస్, డీపీఎంవో ఉమావతి, శశిభూషణ్, నాగభూషణం, మెడికల్ ఆఫీసర్ పుష్పలత పాల్గొన్నారు.

నేత్రపర్వం.. కూడారై ఉత్సవం

వెంకన్న ఆలయాలకు ధనుర్మాస శోభ



స్టీల్‌ప్లాంట్‌లోని ఆలయంలో వేంకటేశ్వర స్వామికి నైవేద్యం సమర్పిస్తున్న అర్చకులు



గోదాదేవికి 172 ఇత్తడి గిన్నెలతో ప్రసాద నివేదన

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కూడారై ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాలాజీ సన్నిధిలో గోదాదేవి చిత్రాన్ని చిత్రించి, చుట్టూ 172 ఇత్తడి గిన్నెల్లో ప్రసాద నివేదన చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

పెండ్లి కుమార్తెగా గోదా దేవి

భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల శ్రీ ప్రసన్న వేంకటేశ్వరాలయంలో గోదా శ్రీనివాసుల కల్యాణాన్ని పురస్కరించుకుని అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యుడు బొడ్డేడ అచ్చిలినాయుడు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఉక్కు వెంకన్న ఆలయంలో..

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1 వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కూడారై ఉత్సవం వైభవంగా జరిగింది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వేకువజామున సుప్రభాత సేవ, సేవా కాలం పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి మంగళాశాసనం చేసి, గోదాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ స్వామి, అర్చకులు ఉదయ కృష్ణమాచార్యులు, హరినారాయణ ఆధ్వర్యంలో 116 వెండి గిన్నెలలో అమ్మవారికి నైవేద్యం నివేదించి, పాశుర విన్నపం చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రామారావు, వాసు



విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న నాయకులు



68వ వార్డులో విజేతకు బహుమతి అందిస్తున్న ఉరుకూటి చందు, కార్పొరేటర్ అనూష, లతీష్

గాజువాక : వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి స్పందన లభించింది. పార్టీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు(చందు) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో భాగంగా జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో 71, 72 వార్డుల మహిళలకు పోటీలను నిర్వహించారు. 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, 72వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు సిరట్ల శ్రీనివాస్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో మహిళలు వినూత్నమైన ముగ్గులతో సందడి చేశారు. అనంతరం న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన విజేతలకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను కార్పొరేటర్ రాజాన రామారావు చేతులమీదుగా ప్రదానం చేశారు.

మిందిలో..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మిందిలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 50 మంది పోటీల్లో పాల్గొన్నారు. మొదటి బహుమతిని గుడివాడ అప్పన్న కాలనీకి చెందిన సంతోషి, మింది గ్రామానికి చెందిన వాసవి రెండో బహుమతిని, రాం నగర్‌కు చెందిన జయశ్రీ తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. విజేతలకు వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు, వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ బహుమతులను అందజేశారు. పోటీలను సీవో జి.వి.లక్ష్మి పర్యవేక్షించారు. పోటీల్లో పాల్గొన్న మరో 30 మందికి కన్సొలేషన్ బహుమతులను అందజేశారు.

కర్ణవానిపాలెం నిర్వాసితులకు పట్టాల పంపిణీ నేడు

అగనంపూడి: ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న కర్ణవానిపాలెం నిర్వాసితుల ఆశలు నెరవేరనున్నాయి. 98 మంది అర్హులైన నిర్వాసితులకు శనివారం ఉదయం పట్టాలు అందించేందుకు రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారని జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, నక్కా రమణబాబు తెలిపారు. రెండున్నర దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న కర్ణవానిపాలెం తరలింపు సమస్య ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చొరవతో పరిష్కారం అయిందన్నారు.

కనీస పెన్షన్ రూ.7,500కు పెంచాలని వినతి



పీఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ నాయకులు

గాజువాక : తమకు ప్రస్తుతం ఇస్తున్న రూ.1000 పెన్షన్‌ను రూ.7,500కు పెంచాలని కోరుతూ నేషనల్ ఏజిటేషన్ కమిటీ ఆధ్వర్యంలో పీఎఫ్ కమిషనర్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ నెల 19న నిర్వహించనున్న సెంట్రల్ బోర్డు టీమ్ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకునే విధంగా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కమిటీ ప్రతినిధులు ఏవీఎస్ఎం అప్పారావు, అచ్చిలనాయుడు, పాలవలస కృష్ణ, రాజన్‌రాజు, గోవింద్ తదితరులున్నారు.

మాట తప్పని నేత జగనన్న

- గాజువాకలో చింతలపూడి స్టిక్కర్ల ప్రచారం



స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న వై.వి.సుబ్బారెడ్డి తదితరులు

గాజువాక : మాట తప్పని నేత, మడమ తిప్పని జగనన్న అంటూ మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య స్టిక్కర్ల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ స్టిక్కర్లను గాజువాకలో సుమారు 200 ఆటోలకు అతికించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి, గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందుతో కలిసి స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా, కేవలం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారన్నారు. అందువల్లే మళ్లీ ఆయనే ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన యువజనోత్సవాలు



విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో భోగి మంటలు వెలిగిస్తున్న కళాశాల అధ్యాపకులు, అతిథులు

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన విజ్ఞాన్ యువతరంగ్ ఘనంగా ముగిసింది. ముగింపు ఉత్సవాన్ని శుక్రవారం ఉదయం సంక్రాంతి సంబరాలతో ప్రారంభించారు. కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న సింబయాసిస్ టెక్నాలజీస్ ప్రతినిధులు కులదీప్, నరేష్‌కుమార్, ఓపెన్ క్యూబ్ సీఈవో వినోద్‌కుమార్ భోగి మంటలు వెలిగించారు. బొమ్మల కొలువులు, రంగవల్లులు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు పాల్గొన్నారు.

ప్రపంచానికే స్ఫూర్తి ప్రదాత వివేకానందుడు



వివేకానందుడి బోధనలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

గాజువాక : స్వామి వివేకానందుని జీవితం ప్రపంచానికే స్ఫూర్తి నింపిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేనంకొండ కృష్ణంరాజు అన్నారు. స్థానిక ఎలీ వ్వనగర్‌లో నిర్వహించిన స్వామి వివేకానంద జయంత్యుత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతను ఉత్తేజితులను చేయడంలో, వారు విజయం సాధించే దిశగా ప్రేరేపించడంలో వివేకానందుని బోధనలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. స్థానిక నాయకులు బాటా శ్రీనివాస్, డి.పావని, వి.శ్రీనివాసరావు, డి.నరసయ్య, ఎలిశెట్టి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

1065వ రోజుకు 'ఉక్కు' దీక్షలు



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేద్దామనుకునే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సరి కాదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే దీక్షల్లో 1065వ రోజు, శుక్రవారం పలు విభాగాల కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. పోలీసులకు సమాచారం ఇవ్వండి



ఆటోల్లో ప్రచారం చేస్తున్న సిబ్బంది

అగనంపూడి: సంక్రాంతి సమయంలో సొంత ఊళ్లకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని దువ్వాడ క్రైం పోలీసులు సూచించారు. మైకుల్లో ఆటోల ద్వారా అగనంపూడి, దువ్వాడ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేయిస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతంలో వలస ప్రజలు ఎక్కువగా ఉంటున్నందున పండగకు ఊరు వెళ్తే సమాచారం ఇస్తే గస్తీ ఏర్పాటు చేస్తామని తెలియజేశారు.

సొసైటీ అభివృద్ధికి సహకరించాలని వినతి



జిల్లా హార్టికల్చర్ అధికారి మన్మథరావును సత్కరిస్తున్న సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు

అగనంపూడి: అగనంపూడి హార్టికల్చర్ సొసైటీ అభివృద్ధికి సహకారం అందించాలని జిల్లా హార్టికల్చర్ సొసైటీ అధికారి మన్మథరావును కమిటీ కోరింది. అగనంపూడి హార్టికల్చర్ సొసైటీ అధ్యక్షుడు నెల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా అధికారిని కలిసిన వారు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు విందుల ఈశ్వరరావు, మింది కన్నారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సచివాలయ ఏఎన్ఎంకు సేవారత్న అవార్డు



మహాలక్ష్మికి అవార్డు అందజేస్తున్న కృష్ణమూర్తి

అక్కిరెడ్డిపాలెం: కరోనా సమయంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం సచివాలయం ఏఎన్ఎం చింతల కె.మహాలక్ష్మి సేవారత్న స్టేట్ అవార్డు 2024 అందుకున్నారు. అక్కిరెడ్డిపాలెం సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నగరానికి చెందిన మదర్ థెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఫౌండర్, అధ్యక్షుడు కె.కృష్ణమూర్తి చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ సెక్రటరీ మున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి నగదు అందిస్తున్న రామ అప్పారావు

అగనంపూడి: బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ కార్మికుడు వర్రి సత్యనారాయణకు సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు, ఆయన మిత్ర బృందం కలిసి రూ.15వేల ఆర్థిక సహాయం అందించారు. నిర్వాసిత కాలనీ అప్పికొండకు చెందిన సత్యనారాయణ కొంతకాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఇతని పరిస్థితి పై స్పందించిన అగనంపూడికి చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ రెండు నెలల నుంచి బియ్యం, సరకులు అందిస్తోంది. ఈ మేరకు రామ అప్పారావు ఆయన మిత్రులు కలిసి నగదును బాధితునికి అందించారు. కార్యక్రమంలో ప్రతినిధులు నిమ్మకూరి రమేష్, గుదే సుశీలా గజేంద్రరావు, కిడిమి హనుమంతురావు, జామి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానపు వాలీబాల్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ జట్టుకు ట్రోఫీ



క్రీడాకారులను అభినందిస్తున్న విభాగం జీఎం మిశ్రా

ఉక్కునగరం: ఆహ్వానపు వాలీబాల్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ వాలీబాల్ జట్టుకు ట్రోఫీ లభించింది. కర్ణాటక స్టేట్ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6,7,8 తేదీల్లో హవేరి జిల్లా అనాజీలో ఆహ్వానపు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 8 జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో స్టీల్‌ప్లాంట్ జట్టుకు ట్రోఫీ, రూ.20 వేల నగదు బహుమతి లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విభాగం జీఎం మిశ్రా విజేతలను అభినందించారు. కార్యక్రమంలో అధికారులు ముఖోపాధ్యాయ, శ్రీమన్నారాయణ, గుర్తింపు సంఘం నాయకులు గోవింద్, జి.రాజు, వై.సాంబశివరావు, ఉరుకూటి అప్పారావు, రమణమూర్తి, ఎ.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

14న స్టీల్‌ప్లాంట్‌లో పతంగుల పండగ

ఉక్కునగరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉక్కునగరం యూనిట్ ఆధ్వర్యంలో ఈ నెల 14న కైట్స్ ఫెస్టివల్ (పతంగుల పండుగ) నిర్వహిస్తున్నామని యూనిట్ కార్యదర్శి వి.ఆర్.కె. రాజు తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కళాక్షేత్రం మైదానంలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఉక్కునగర వాసు లు, బాలికలు పాల్గోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు సీహెచ్. వేణు (7013684439), ఎ.వి. రవిచంద్ (9492349149) లను సంప్రదించాలని సూచించారు.